గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం

- నిత్యం అందుబాటులో వైద్యసిబ్బంది
- ఉచితంగా మందుల పంపిణీ



పొదలకూరు మండలం వెలికంటిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు (ఫైల్)

పొదలకూరు : రాష్ట్ర ప్రభుత్వం మారుమూల పల్లెలకు కూడా నాణ్యమైన వైద్యాన్ని అందిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రతి ఇంటికీ డాక్టర్‌ను పంపి వ్యక్తిగత పర్యవేక్షణ చేయిస్తోంది. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారి ఇంటికి వైద్యులు వెళ్లి పలుకరించి సాధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం 104 అంబులెన్స్ సేవలను కూడా వినియోగించుకుంటూ రోగులకు నాణ్యమైన 54 రకాల మందులను అందజేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలను చేస్తూ వారు బయటి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం వైద్యానికి కావల్సిన నిధులు అందజేస్తూ పీహెచ్‌సీ భవనాలు పాడై ఉంటే వెంటనే కొత్త భవనాల కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేస్తోంది. గ్రామీణులు రూ.వేలాది నిధులు వెచ్చించకుండా కాన్పులను కూడా పీహెచ్‌సీల్లో విజయవంతంగా చేస్తున్నారు. సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు పేదలకు సంజీవనిలా ఉపయోగపడుతున్నాయి. అంతేకాక ఆరోగ్య సురక్ష పేరుతో సచివాలయాల పరిధిలో నిపుణులైన వైద్యుల ద్వారా రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తున్నారు.

పీహెచ్‌సీల్లో రక్తపరీక్షలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌కు సంబంధించిన పరికరాల ద్వారా అన్నిరకాల పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇవే పరీక్షలను బయట చేయించుకోవాలంటే రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. రక్త నమూనాల ద్వారా కిడ్నీ, లివర్, ఇతర పరీక్షలను చేస్తున్నారు. పేదలకు ఇలాంటి పరీక్షలు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయి. ప్రతి పీహెచ్‌సీకి రూ.3 లక్షల విలువైన ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలను ప్రభుత్వం అందజేసింది.

మండలానికి రెండు పీహెచ్‌సీలు

ఇటీవల ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు వైద్యసేవలను మరింతగా విస్తరించేందుకు మండలానికి రెండు పీహెచ్‌సీలు ఉండాలనే లక్ష్యంతో అదనంగా కో–లొకేటెడ్ పీహెచ్‌సీని ఏర్పాటు చేసింది. ఇక్కడ కూడా ఇద్దరు డాక్టర్లతో పాటు, నర్సులు, సిబ్బంది ఉంటారు. త్వరలో వీటికి పక్కా భవనాల కోసం నిధులను మంజూరు చేయనుంది.

సర్వేపల్లి నియోజకవర్గంలో..

మొత్తం మండలాలు	5
పీహెచ్‌సీల సంఖ్య	10
వైద్యులు	17 మంది
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు (హెల్త్ సబ్‌సెంటర్లు)	87 మంది
ఆరోగ్య కార్యకర్తలు (ఎంఎల్‌హెచ్‌పీ)	163 మంది
ఆరునెలల్లో పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య	82
ఆశావర్కర్ల సంఖ్య	206
పీహెచ్‌సీల్లో కొత్త భవనాలు	3
కొత్త భవనాలకు నిధులు	రూ.3.68 కోట్లు
హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీల్లో లభ్యమైయ్యే మందుల సంఖ్య	54



వైద్యపరీక్షల కోసం పీహెచ్‌సీకి వచ్చిన రోగులు



వెంకటాచలం మండలం కసుమూరు పీహెచ్‌సీ భవనం



తోటపల్లిగూడూరు మండలం కోడూరు పీహెచ్‌సీ భవనం

క్లుప్తంగా

క్రీడా భారతి నూతన కమిటీ ఎన్నిక



క్రీడాభారతి జిల్లా నూతన కమిటీ సభ్యులు

నెల్లూరు (టౌన్) : క్రీడా భారతి జిల్లా నూతన కమిటీని గురువారం స్థానిక పెద్ద బజారులోని మేధా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్రీడా భారతి జిల్లా ప్రెసిడెంట్‌గా కొండారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లుగా సుబ్బయ్య, రానా ప్రమోద్‌రెడ్డి, లక్ష్మి, మల్లికార్జున్, జనరల్ సెక్రటరీగా సీహెచ్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఇమ్రాన్, ట్రెజరర్‌గా శ్రీహరిరెడ్డి, సభ్యులుగా మురళీ, రఘురామిరెడ్డి, కోటారెడ్డి, శ్రీనివాస్, దివ్యప్రకాష్, దిలీప్, శ్రీధర్, ప్రసన్న, సౌమ్య, విజయకుమారి, వెంకటేశ్వరి, మౌనిక, నవీన్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, సమీర్ నియమితులయ్యారు. కమిటీ అబ్జర్వర్లుగా క్రీడాభారతి ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ ధనుంజయ్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా సెక్రటరీ ధనుంజయ్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు రెవెన్యూ డివిజన్లలో నూతన కమిటీలను నియమించామన్నారు. క్రీడా భారతి జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేసి ఎక్కువ మంది క్రీడాకారులను తయారు చేసి 2036 ఒలింపిక్స్‌లో దేశం తరఫున అధిక మెడల్స్‌ను సాధించే విధంగా క్రీడాభారతి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, సీనియర్ ప్లేయర్స్, జాతీయస్థాయి క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం పదో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య మాట్లాడుతూ ఈ సంఘం ద్వారా రాష్ట్రంలోని బీసీలను ఏకం చేసి చైతన్య సభలు నిర్వహించడం, అన్నదానాలు, అగ్నిప్రమాద బాధితులకు సాయం చేయడం, పేద బీసీ విద్యార్థులకు ఆర్థిక సాయం వంటివి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుబ్బయ్య, జ్యోతి, రాము, జయరామరాజు, విజయ్‌కుమార్, చంద్ర పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు ఆన్‌లైన్లో శిక్షణ



ఆన్‌లైన్ శిక్షణలో డీసీఓ గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)కు గురువారం ఆన్‌లైన్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహించారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో జిల్లా సహకారశాఖ అధికారి (డీసీఓ) గుర్రప్ప ఆన్‌లైన్ ద్వారా జిల్లాలో ఉన్న 78 పీఏసీఎస్‌లు, సహకార శాఖ ఆడిట్ అధికారులతో శిక్షణా తరగతులు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లను వేగవంతంగా కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటైన కామన్ సర్వీస్ సెంటర్లకు ఐడీ కార్డులు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కామన్ సర్వీసు సెంటర్ల ద్వారా ఇప్పటి వరకు రూ.2.55 కోట్ల ఆదాయం రాగా, జిల్లాలో రూ.3.80 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. అదేవిధంగా జిల్లాలో పెట్రోల్ బంకుల ఏర్పాటు, జనరిక్ మందుల దుకాణాలను పెంచడంపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో సహకారశాఖ రాయచోటి అసిస్టెంట్ రిజిస్ట్రార్ హబీబుల్లా, నెల్లూరు డీసీఏఓ తిరుపతయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెం గాంధీ నగర్‌లోని కృష్ణ మందిరంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని అర్చకుడు బి.శ్రీనివాసాచార్యులు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేశారు. పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఉభయకర్తలుగా బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణీ మల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను మందిర కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

సేంద్రియ పద్ధతులపై దృష్టి సారించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు : వరిసాగులో సేంద్రియ పద్ధతులపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి సూచించారు. మండలంలోని ముంగళదొరువు, సౌత్‌ఆములూరు గ్రామాల్లో సమగ్ర పోషణ యాజమాన్య పద్ధతులపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వ్యవసాయంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా ఎరువుల యాజమాన్యం అత్యంత కీలకమన్నారు. భూసారానికి నష్టం చేసే రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. సాగుకు ముందు మట్టి పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా ఎరువులను ఎంపిక చేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వంటి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకేల వ్యవసాయ సహాయకులు కుసుమ, కావేరి, పలువురు రైతులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంతో నైపుణ్యం పెంపు



వేసిన బొమ్మలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కొడవలూరు : చిత్రలేఖనం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందుతుందని గ్రంథాలయాధికారి కె.రాజేశ్వరి తెలిపారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం వారితో నీతి కథలు చెప్పించడం చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నీతి కథలు చదివి వినిపించడం ద్వారా విద్యార్థుల్లో వినికిడి సామర్థ్యం పెంపొందుతుందన్నారు. వచ్చే నెల 7వ తేదీ వరకు కొనసాగే వేసవి శిక్షణా శిబిరానికి విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు.

ఎరువుల వినియోగంపై అవగాహన ఉండాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ వెంకటకృష్ణయ్య

విడవలూరు : వరిసాగులో ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకటకృష్ణయ్య అన్నారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో ఆయన రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమిలో వరి లేదా ఇతర పంటలకు ఎంత మోతాదులో ఎరువులను వినియోగించాలో ప్రతి రైతు తెలుసుకోవాలని తెలిపారు. యూరియా, నానో యూరియా, డీఏపీ వంటి ఎరువులు ఏ సమయంలో, ఎంత మోతాదులో వాడాలో తెలుసుకోవాలని, లేదంటే రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని కోరారు. అనంతరం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూసారాన్ని పెంపొందించుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ జహీర్

మనుబోలు : రైతులు తమ పొలాల్లో భూసారాన్ని పెంపొందించుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్.జహీర్ సూచించారు. మండలంలోని అక్కంపేట, వీరంపల్లి సచివాలయాల్లో గురువారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇందులో భూసారాన్ని పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి వాటి స్థానంలో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి వాటిని పూత దశలో భూమిలో కలియదున్నడం వల్ల భూమిలో కర్బన శాతం, నేలలో పోషకాలు పెరిగి భూసారం పెరుగుతుందన్నారు. ఆయన వెంట వీఏఏలు ప్రతాప్, శ్రీదేవి ఉన్నారు.

వెంకటాచలం రైల్వే గేటు మూత



రైల్వే గేటు వద్ద పనులు చేయిస్తున్న అధికారులు

వెంకటాచలం : మండల కేంద్రమైన వెంకటాచలంలోని రైల్వేగేటును మరమ్మతుల కారణంగా వారం రోజుల పాటు మూత వేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ గేటు వద్ద రైలు పట్టాలు, రోడ్డును బాగు చేసే పనులు గురువారం ప్రారంభమయ్యాయని తెలియజేశారు. ఈనెల 29వ తేదీ వరకు పనులు జరుగుతాయని, ఈ మార్గంపై రాకపోకలు కొనసాగించే ప్రయాణికులు ఇతర మార్గాల గుండా వెళ్లాలని కోరారు. రైల్వే గేటు మూత పడడంతో ప్రయాణికులు తిక్కవరప్పాడు మీదుగా నెల్లూరుకు రాకపోకలు కొనసాగిస్తున్నారు.

ఓటమి భయంతోనే పిచ్చికూతలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తోటపల్లిగూడూరు : సోమిరెడ్డికి మరోసారి ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుని పిచ్చి కూతలు కూస్తున్నాడని, జూన్ 4వ తేదీన టీడీపీ నేతలందరికీ ముచ్చెమటలు తప్పవని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కోవెరపాళెంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ రేవ్ పార్టీలకు వెళ్లే సంస్కృతి కాకాణికి లేదన్నారు. అలాంటి పార్టీలకు వెళ్లి చెప్పుదెబ్బలు తిన్న అనుభవం సోమిరెడ్డికే ఉందన్నారు. రేవ్ పార్టీకి సంబంధించి ఆల్కహాల్ పరీక్షలకు రావాలని కాకాణి సవాల్ విసిరితే సోమిరెడ్డితో పాటు ఆయన తొట్టిగ్యాంగ్ పరారైనట్లు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ మాట్లాడుతూ గతంలో సోమిరెడ్డిని శ్రీనివాస్ మహాల్ వద్ద ఆడవాళ్లు చెప్పులతో కొట్టడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో నెల్లూరు ఏఎంసీ డైరెక్టర్ మన్నెం చిరంజీవులగౌడ్, మాజీ జెడ్పీ సభ్యుడు మన్నెం చిరంజీవులగౌడ్, పేడూరు సొసైటీ డైరెక్టర్ తిరవళ్లూరు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు సవర్ల బంగారు నగల చోరీ

పొదలకూరు: మండలంలోని ముదిగేడు గ్రామంలో ఓ ఇంట్లో దొంగతనం జరిగినట్లు గురువారం పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన అక్కెం అంకిరెడ్డి కుటుంబం బుధవారం రాత్రి తిరునాళ్లకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు అతని ఇంట్లోకి వెళ్లారు. బీరువాలో దాచిన ఆరు సవర్ల బంగారు నగలను దొంగిలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ బైక్ అపహరణ

వెంకటాచలం : రోడ్డు పక్కన నిలిపిన మోటారు బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన వెంకటాచలంలో గురువారం జరిగింది. వెంకటాచలానికి చెందిన గంటా బాబు ఏపీ 39 బీఆర్ 3764 నంబర్ గల తన మోటారు బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి నిజాం అనే వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి పది నిమిషాల తరువాత వచ్చేసరికి బైక్ అదృశ్యమైంది. వెంటనే అతను పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి ఆలయ రాబడి రూ.6.80 లక్షలు

ఇందుకూరుపేట : గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయ హుండీ రాబడి రూ.6,80,749లు అని ఆలయ ఈఓ బండి శాంతయ్య తెలిపారు. జనవరి 6 నుంచి ఇప్పటి వరకు హుండీ ఆదాయం రూ.6,55,850 కాగా, అన్నప్రసాద వితరణకు రూ.24,899లను భక్తులు సమర్పించారని చెప్పారు. కార్యక్రమంలో మస్తాన్‌బాబు, కెనరా బ్యాంక్ మేనేజర్ ఎం.శ్రీహరి, విద్యాసాగర్‌రావు, విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

భోగ శ్రీనివాసుని వెండి విగ్రహం బహూకరణ



పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి స్థానికుడు చీమకుర్తి శివకుమార్–వాణి దంపతులు భోగ శ్రీనివాసమూర్తి వెండి విగ్రహాన్ని గురువారం బహూకరించారు. దాతలకు దేవస్థానం కమిటీ వారు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శివకుమార్ దంపతులు 10 కిలోల వెండితో రూ.11 లక్షలు ఖర్చు చేసి విగ్రహాన్ని తయారు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం నిర్వహణ కమిటీ అధ్యక్షుడు పెంద్యాల రమణయ్యనాయుడు మాట్లాడుతూ త్వరలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న తరుణంలో భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని అందజేయడం భగవత్ సంకల్పంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఆలయ కమిటీ బాధ్యులు దేవరం రఘురామిరెడ్డి, ఎం.శ్యామ్‌ప్రసాద్, వేణుగోపాల్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా



మనుబోలు : మండలంలోని మనుబోలు, జట్లకొండూరు, మడమనూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో గురువారం సాయినాథునికి విశేష పూజలు నిర్వహించారు. మనుబోలులోని పిడూరు రోడ్డులో ఉన్న సాయిబాబా ఆలయంలో అర్చకుడు శ్రీనివాసులు సాయిబాబాకు అభిషేకాలు జరిపించి ప్రత్యేకాలంకరణ చేశారు. మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కంటి మురళీ, శ్రీలత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సాయినాథుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

శిరిడీ బాబా మందిరంలో

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

భూసారాన్ని పరిరక్షించుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : దిగుబడులు పెరగాలంటే భూసారాన్ని పరిరక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్‌ఎస్.లక్ష్మి సూచించారు. మండలంలోని తలమంచి, వెంకన్నపురంలలో భూసార పరిరక్షణపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు లేదా మూడు పంటల తర్వాత పచ్చిరొట్ట పైరును సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చన్నారు. భూమి సారవంతంగా ఉంటే దిగుబడులు గణనీయంగా పెరుగుతాయని చెప్పారు. ప్రస్తుత ఎడగారులో పంట విరామం ఇస్తున్న రైతులు పచ్చిరొట్ట పైరును సాగు చేయడం ద్వారా నేలను సారవంతం చేసుకోవాలన్నారు. వరిసాగులో సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని, మార్కెట్‌లో గణనీయమైన ధరలకు విక్రయించుకునే వెసులుబాటు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు ఎస్.ప్రసాద్, బి.లిఖిత, రైతులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌ను విధిగా వేయించుకోవాలి



రామన్నపాలెంలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు : పెద్దల కోసం ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చిన బీసీజీ వ్యాక్సిన్‌ను విధిగా వేయించుకోవాలని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.బాలచంద్రబాబు సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెం, రామన్నపాళెంలో గురువారం నిర్వహించిన బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దలకు క్షయ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సిన్ వేస్తామన్నారు. క్షయ రాకుండా ఉండడంతో పాటు బీపీ, షుగర్ సైతం అదుపులో ఉంటాయన్నారు. 20 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ విధిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఏలు వెంకట్రావు, షఫీఉద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీ మాబ్‌జాన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.